కుమారుడు పట్టించుకోవడం లేదని ఆర్డీఓకు ఫిర్యాదు

ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న నర్సయ్య దంపతులు

సూర్యాపేటటౌన్, అక్టోబర్ 23 : కుమారుడు పట్టించుకోవడం లేదని బుధవారం ఆర్డీఓ వేణు మాధవరావుకు వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్.ఎస్ మండలం కందగట్ల గ్రామానికి చెందిన అర్రూరు నర్సయ్య, అన సూర్యకు వెంకన్న ఒక్కడే కుమారుడు. గత 20 ఏండ్లగా వేరు కాపురం పెట్టాడు. నర్సయ్యకు చెందిన ఐదెకరాల భూమిని మూడేళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. తల్లిదండ్రులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వక పోగా.. తినేందుకు ధాన్యం కూడా ఇవ్వడం ఇదు. ఇదేమని అడిగితే వారిపై చేతబడి నెపం మోపి ఇంటి నుంచి గెంటివేశాడు. ఇదే విషయమై పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెడితే సీజన్‌కు రూ.5వేలు, పుట్టెడు వడ్లు ఇస్తానని ఒప్పుకొని ఇప్పుడు మొఖం చాటేశాడు. ఉన్న భూమినంతా తన పేరు మీద రాయాలని ఇబ్బందులకు గురి చేస్తున్న వెంకన్న ఆగడాలకు తాళలేక తమకు న్యాయం చేయాలని ఆర్డీఓను వేడుకున్నట్లు నర్సయ్య దంపతులు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్, అక్టోబర్ 23 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పశువుల కోల్పోయిన ఆరుగురు రైతులకు నష్ట పరిహారం చెక్కులు అందించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సునీత, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి నాయకులున్నారు.

కోదాడ రూరల్ : పట్టణ పరిధిలోని కొమరబండలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, నాని, ఏఓ రజని, రామారావు, భద్రిగౌడ్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండలంలోని సింగారెడ్డిపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ లాలూనాయక్ ప్రారంభించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం అజయ్‌నాయక్, ఏఓ అనిల్‌నాయక్, శైలజ రాయి, చంద్రకళ, లలితమ్మ, గీతరాణి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌పై కేసు నమోదు చేయాలి : బీఆర్ఎస్

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గరిడేపల్లి, అక్టోబర్ 23 : మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై బుల్డోజర్లు ఎక్కిస్తామని అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌పై కేసు నమోదు చేయాలని హుజూర్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్‌కుమార్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ చలికంటి నరేశ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిలా కాకుండా ముఠా నాయకుడిగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ భాష శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లెపంగ నాగరాజు, రాం సైదులు, మధు, నందిపాటి నరహరి, బుడిగ సతీశ్‌గౌడ్ తదితరులున్నారు.

సైన్స్ సంబురాలను విజయవంతం చేయాలి : ఎంఈఓ

హుజూర్‌నగర్ : చెకుముకి టెస్ట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మేళ్లచెర్వు, అక్టోబర్ 23 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైన్స్ సంబురాలను విజయవంతం చేయాలని ఎంఈఓ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కందిబండ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోస్టర్ల ఆవిష్కరణలో ఆయన హాజరయ్యారు. నవంబర్ 7న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయిలో, 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్. జాఫర్, హెచ్ఎం అనీల్‌కుమార్, నారపరెడ్డి, రోషిరెడ్డి, ఉపేంద్రయ్య, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : చెకుముకి టాలెంట్ టెస్ట్ గోడ పత్రికను ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంఈఓ సైదానాయక్ బుధవారం పట్టణంలోని జడ్పీఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, జయవాణి పాల్గొన్నారు.

బూరుగడ్డలో పారిశుధ్యం పడకేసింది : బీఆర్ఎస్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు పరశురాం

హుజూర్‌నగర్ రూరల్ , అక్టోబర్ 23 : మండలంలోని బూరుగడ్డ గ్రామపంచాయతీలో పారిశుధ్యం పడకేసిందని బీఆర్ఎస్ నాయకుడు మాడుగుల పరశురాం అన్నారు. బుధవారం ఆయన విలేరులతో మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పాలనలో వీధుల్లో చెత్త పేరుకొని వ్యాధులు వ్యాపిస్తున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట నాయకులు వీరయ్య, గురుస్వామి, వెంకన్న ఉన్నారు.

బహుజన నాయకులను కాంగ్రెస్ ఎదగనివ్వదు : మహేశ్‌యాదవ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు పరశురాం

మద్దిరాల, అక్టోబర్ 23 : బహుజన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులను రాజకీయంగా ఎదుగనీయకుండా చేయడమే కాంగ్రెస్ పార్టీ పనిగా పెట్టుకుందని భారత యాదవ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిటి మహేశ్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో స్వామి, భరత్, రాము, ఎల్లేశ్, నరేశ్ తదితరులున్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నార్కట్‌పల్లి, అక్టోబర్ 23 : పత్తి రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,521 పొందాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చౌడంపల్లిలోని వరలక్ష్మి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పత్తి కొనుగోళ్లపై ఆరా తీశారు. ఇప్పటి వరకు కాటన్ మిల్లుకు వచ్చిన పత్తి ప్రస్తుతం మిల్లులో ఉన్న పత్తి తేమ శాతం తనిఖీ చేశారు. మిల్లుకు పత్తి తెచ్చిన రైతులతో మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 22 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు పత్తిలో తేమశాతం 12కు మించకుండా ఆరబెట్టి తీసుకెళ్లాలన్నారు. అయితే ప్రతిరోజూ వర్షం కురుస్తున్నదని, దాంతో పత్తిని ఎండబెట్టలేక పోతున్నామని రైతులు కలెక్టర్‌కు చెప్పగా ఆయన స్పందించి.. ఈ నెల 26 వరకే వర్షాలు ఉన్నాయని, ఆ తర్వాత లేవని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ చౌడంపల్లి, నార్కట్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

నల్లగొండ :అంకిత భావం, కష్టపడే మనస్తత్వం ఉంటే ఏ రంగంలో నైనా రాణించవచ్చని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఆర్సెటీలో టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందిన వారికి బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, ఆర్సెటీ డైరెక్టర్ రఘుపతి పాల్గొన్నారు.

అంకిత భావంతో రాణించవచ్చు

ఎంజీ యూనివర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక

రామగిరి, అక్టోబర్23: మహాత్మాగాంధీ యూనివర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు బుధవారం యూనివర్సిటీలో నిర్వహించారు. వర్సిటీ అనుబంధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 15 డీగ్రీ, పీజీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల నుంచి55 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి హరీశ్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ టీం విద్యార్థులు ఈ నెల 30 నుంచి నవంబర్ 3 వరకు చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఆర్.మురళి, వై.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

వర్షానికి తడిసిన ధాన్యం

శాలిగౌరారం, అక్టోబర్ 23 : మండలం కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి పోశారు. ప్రస్తుతం మార్కెట్‌లో 30వేల బస్తాల ధాన్యం ఉన్నది. కానీ నిర్వాహకులు కాంటాలు ఆలస్యం చేస్తుండడంతో వర్షానికి ధాన్యం తడుస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోగా సాయంత్రం వాటిని కొనుగోలు చేయక పోవడంతో కేంద్రంలోనే కుప్పగా పోశారు. మంగళవారం రాత్రి భారీ వర్షం కురియడంతో ధాన్యం పూర్తిగా తడిసింది.

నెల్లికల్ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలి :సబ్ కలెక్టర్

మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 23: రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న నెల్లికల్ లిఫ్టు పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ అమిత్‌నారాయణ్ కోరారు. మండలంలోని నెల్లికల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లికల్ లిఫ్టు ప్రాజెక్టులో భాగంగా రైతుల పొల్లాల్లోంచి పైపులైన్లు వేస్తారని, సదరు భూమికి ప్రభుత్వం రైతులకు పరిహారం అందిస్తుందని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రాజెక్టుకు సంబంధించి ఎర్రచెరువుతండా, నెల్లికల్, పిల్లిగుండ్లతండా, జాల్‌తండా గ్రామాల రైతుల భూముల్లోంచి పైప్‌లైన్ వేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తాసీల్దార్ అనిల్, ఆర్ఐ లక్ష్మీకాంత్, నెల్లికల్ ప్రాజెక్టు ఇంజినీర్లు, సర్వేయర్లు, పాల్గొన్నారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఓపెన్‌హౌస్

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నల్లగొండ సిటీ, అక్టోబర్ 23 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రాములునాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాలపై అవగాహన కల్పించారు. బాంబ్ డిటెక్టర్, పోలీస్ డాగ్స్, ఫింగర్ ప్రింట్, క్లూస్‌టీం, షీటీమ్ భరోసా, కంమాండ్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు వంటి వాటిపై పోలీసులు వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ రాములునాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరగాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ రమేశ్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ ఐలు సంతోశ్, శ్రీను, ఆర్ఎస్ఐలు కళ్యాణ్, రాజీవ్, సాయిరాం, నాగరాజు పాల్గొన్నారు.

వివిధ పోలీస్ స్టేషన్లలో..

తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్, నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్, నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది, త్రిపురారంలో హాలియా సీఐ జనార్దన్‌గౌడ్, ఎస్ఐ వై.ప్రసాద్,మాడ్గులపల్లిలో ఎస్ఐ ఎస్.కృష్ణయ్య, చండూరులో సీఐ వెంకటయ్య, ఎస్ఐ వెంకన్న, ఆధ్వర్యలో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. విద్యార్థులకు పోలీసుల విధులు, పోలీస్ స్టేషన్ వ్యవస్థ, రికార్డులు, ఆయుధాలపై అవగాహన కల్పించారు.

'అవి పట్టా భూములే'

మిర్యాలగూడ, అక్టోబర్23 : దామరచర్ల మండలం కొత్తపల్లి గ్రామ శివారులో రైతుల నుంచి తాము పట్టా భూములనే కొనుగోలు చేశామని, అవి సీలింగ్ భూములు కావని మిర్యాలగూడ పట్టణానికి చెందిన రైతులు ఆమటి రామాంజనేయులు, వింజం ముసలయ్య, సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలో మీడియాతో మాట్లాడారు. పట్టెపు పద్మ, జూబిశెట్టి శ్రీనివాసరావుల నుంచి 6.14 ఎకరాల భూమిని రామాంజనేయులు, బలుగురి ఏసమ్మ, రాయికింది చిన్న కోటయ్యల నుంచి 5.29 ఎకరాలు భూమిని, వింజం ముసలయ్య, జమ్మికుంట సైదమ్మ నుంచి 2.25 ఎకరాల భూమిని సాధినేని శ్రీనివాసరావు కొనుగోలు చేశారని వివరించారు. కొనుగోలు చేసిన భూములు 1990– 1991 నుంచి పట్టా భూములుగా ఉన్నాయని, 30 ఏండ్లుగా పట్టా భూములుగానే రికార్డుల్లో ఉన్నాయన్నారు. 15 రోజుల క్రితం వరకు కూడా ధరణిలో పట్టా భూమిగానే ఉన్నదని, పదిరోజుల క్రితం సీలింగ్ భూమిగా నమోదు చేశారని ఆరోపించారు. భూముల కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, రెవెన్యూ అధికారులు తమకు ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా ఏకపక్షంగా పట్టాలు రద్దు చేయటం సరికాదన్నారు. తాము తప్పుడు పట్టాలు చేయించుకున్నట్లు కొంతమంది దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. భూవివాదంపై తాము న్యాయస్థానాలను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్ట్

మునుగోడు, అక్టోబర్ 23 : మునుగోడుకు చెందిన యాసరాని శివ ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే మండల కేంద్రానికి చెందిన పందుల రవితేజ తన కుమారుడిని డబ్బుల విషయంలో బెదిరించడం, వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు శివ తండ్రి వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి పర్యవేక్షణలో చండూరు సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో విచారణ జరిపారు. నిందితుడు పందుల రవితేజను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద నుంచి బైక్, రెండు సెల్‌ఫోన్లు, రూ.2వేల నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ : ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల కార్మిక సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతం రెడ్డి అన్నారు. బుధవారం విలేకరు లతో మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను బంజూరు చేసి ఈ–కుబేర వ్యవస్థను రద్దు చేయాలన్నారు.

ఎన్‌జీ కళాశాల పీజీ ఫలితాలు విడుదల

రామగిరి, అక్టోబర్ 23: జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో పీజీ రెగ్యులర్ 2,4 సెమిస్టర్, బ్యాక్‌లాగ్ 1,3వ సెమిస్టర్ ఫలితాలను బుధవారం ఎంజీయూలో సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి విడుదల చేశారు. ఫలితాలు త్వరగా విడుదల చేసేందుకు కృషి చేసిన కళాశాల సీఈఓ బి.నాగరాజు బృందాన్ని అభినందించారు. ఫలితాలను ఎన్జీ కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, అదనపు సీఓఈ వైవీఆర్ ప్రసన్నకుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ పరంగి రవికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిర్బంధపాలన :బీఆర్ఎస్వీ

చందంపేట, అక్టోబర్ 23 : రాష్ట్రంలో నిర్బంధపాలన పాలన కొనసాగుతుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు అన్నారు. బుధవారం చందంపేటలో రాజు మాట్లాడుతూ రామన్నపేటలో అంబూజా సిమెంట్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటున్నారన్న సమాచారం మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యను అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు.

చెర్వుగట్టు హుండీ లెక్కింపు

నార్కట్‌పల్లి, అక్టోబర్ 23 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవాలయ హుండీలను 70 రోజుల తర్వాత బుధవారం లెక్కించారు. గుట్టపైన స్వామివారి హుండీ ఆదాయం రూ.24,43,040, గుట్ట కింద అమ్మవారి హుండీ ఆదాయం రూ.7,72,730 మొత్తం రూ. 32,15,770 వచ్చినట్లు ఈఓ నవీన్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ పరిశీలన

పెద్దవూర, అక్టోబర్ 23: మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని బుధవారం తాసీల్దార్ సుజాత, ఎంఈఓ తరి రాము పరిశీలించారు. పెద్దవూర జడ్పీ హైస్కూల్, పులిచర్ల ఎట్టీ బాలుర గురుకుల పాఠశాల, కేజీబీవీ, పెద్ద గూడెం, వెల్మగూడెం జడ్పీహెచ్ఎస్‌ను సందర్శించి ఓటు నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పత్తి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి : సీపీఐ

రామగిరి, అక్టోబర్ 23: జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన చోట్ల నేటికీ రైతుల నుంచి పత్తి కొనుగోలు చేపట్టలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. దాంతో రైతులు తప్పని పరిస్థితుల్లో దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సీసీఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటివిడుదల నిలిపివేత

నందికొండ, అక్టోబర్ 23 : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గడంతో డ్యాం క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ఎన్నెస్పీ అధికారులు బుధవారం నిలిపివేశారు. సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 589.40 అడుగులు(310.2522 టీఎంసీలు) ఉంది. ఎడమ కాల్వ ద్వారా 6,173 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 10,120, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,191, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, వరద కాల్వ ద్వారా 400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 48,284 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అదే స్థాయిలో అవుట్ ఫ్లోను కొనసాగిస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

మర్రిగూడ,అక్టోబర్ 23 : మండలంలోని తూర్పుతండాకు చెందిన కొండూరు ఫీల్డ్ అసిస్టెంట్ విచ్చానాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం బీఆర్ఎస్ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ మారగోని వెంకటయ్య యాదవ్ రూ.10వేలు, కొండూరు గ్రామశాఖ అధ్యక్షుడు వల్లపు సైదులు యాదవ్ రూ.5వేలు, బండి శేఖర్ గౌడ్ రూ.11వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంభం మాధవరెడ్డి, నాయకులు బండి జహంగీర్, బడేటి జంగయ్య, ఈద కృష్ణ, గూడూరు సాల్జార్జగ్, రాములు, దుబ్బ గిరి, వల్లపు మల్లేశ్, బండి వెంకటయ్య పాల్గొన్నారు.

సీపీఎం ఎల్లారెడ్డిగూడెం కార్యవర్గం ఎన్నిక

నార్కట్‌పల్లి, అక్టోబర్ 23 : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో సీపీఎం 15వ శాఖ మహాసభలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిగూడెంతో పాటు అనుబంధ గ్రామాల శాఖ కార్యదర్శులుగా దండు నాగరాజు, అలుగుబెల్లి లింగారెడ్డి, నంద్యాల నర్సిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా మాదగోని సైదులు, వీరనేని శంకర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామశాఖ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ నిరతంతరం పేదల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు.

రక్తదానం చేయాలి : ఎస్పీ

కోదాడ రూరల్ : విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రాము

సూర్యాపేటటౌన్, అక్టోబర్ 23 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ఈ నెల 25న శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో యువత, ప్రజలు పాల్గొనాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9గంటలకు ఎస్పీ ఇంజినీరింగ్ కళాశాల రోడ్డులోని పోలీస్ కార్యాలయానికి రావాలని కోరారు.

కోదాడ రూరల్ : పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులకు స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సీఐ రాము డయల్ 100, నేరాల నియంత్రణలో సీసీ కెమేరాల పాత్ర, మహిళా రక్షణ చట్టాలు, ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

హుజూర్‌నగర్ : పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య పోలీసుల విధులు, సాంకేతికత సద్వినియోగం, ఆయుధాల ఉపమోగం, కేసుల దర్యాప్తు, కమ్యునికేషన్ వ్యవస్థ, ఫోరెన్సిక్ సైన్స్, రికార్డుల నిర్వహణ, పోలీసుల త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు.

పోలీస్ అమరవీరుల కుటుంబాల సందర్శన

సూర్యాపేట టౌన్ : జిల్లా కేంద్రంలో నివాసముంటున్న పోలీస్ అమరవీరుల కుటుంబాలను సీఐ రాజశేఖర్ సందర్శించి పరామర్శించారు. అమరుడు హెడ్ కానిస్టేబుల